నాలుగో రోజూ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె

మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 25 : శాతవాహన విశ్వవిద్యాలయంలోని కాంట్రాక్ట్, పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె శుక్రవారం నాలుగో రోజు కొనసాగింది. శిబిరంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందరూ మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్స్ అందరినీ వన్ టైం సెటిల్మెంట్‌గా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

కొత్త ఆర్‌వోఆర్ చట్టంతో రైతులకు మేలు: కలెక్టర్

జమ్మికుంట, ఏప్రిల్ 25: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం 'భూ భారతి' ప్రవేశపెట్టిందని, కొత్త ఆర్‌వోఆర్ చట్టంతో రైతులకు మేలు చేస్తున్నదని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల తహసీల్దార్ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో, ఇల్లందకుంట మండల కేంద్రంలో తహసీల్దార్ రాణి ఆధ్వర్యంలో 'భూ భారతి'పై అవగాహన సదస్సును ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. భూ భారతి, కొత్త చట్టం, తదితర అంశాలను వివరించారు. రైతుల సందేహాలు నివృత్తి చేశారు. ఆయా అవగాహన సదస్సుల్లో ఆర్డీవో రమేశ్‌బాబు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 25: ఈ నెల 28 నుంచి ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రారంభం కానున్న వేసవి శిక్షణ తరగతులను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రైవేట్ విద్యాసంస్థల కరస్పాండెంట్లు, ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. వేసవి శిక్షణ శిబిరాలకు సంబంధించి పలు అంశాలపై వారికి దిశా నిర్దేశం చేశారు. కరీంనగర్‌లోని బాల భవన్, అంబేద్కర్ స్టేడియం, సప్తగిరి కాలనీలోని కేజీబీవీ స్కూలు, మంకమ్మ తోటలోని గర్ల్స్ హైస్కూల్‌తో పాటు ఎంపిక చేసిన పది ప్రైవేటు పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు జరుగుతాయని తెలిపారు. మొత్తం 27 అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఉంటుందని చెప్పారు. సమావేశంలో అధికారులతోపాటు ప్రైవేట్ విద్యా సంస్థల ప్రతినిధులు శేఖర్ రావు, రామారావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగుల ఆశ్రమాలను సందర్శించిన న్యాయమూర్తి

కోర్టుచౌరస్తా, ఏప్రిల్ 25: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకనుగుణంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేశ్ శుక్రవారం నగరంలోని ప్రభుత్వ వృద్ధులు, వికలాంగుల ఆశ్రమాలతో పాటు స్వధార్ హోమ్‌ను సందర్శించారు. వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులు, వికలాంగులతో ఆయన ముచ్చటించారు. ఎలాంటి న్యాయపరమైన సహాయం, న్యాయ సేవలు అవసరమైనా తమను సంప్రదించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా వృద్ధులు వికలాంగుల ఆశ్రమంలో, స్వధార్ హోమ్‌లో పండ్లు పంపిణీ చేశారు.

నగరంలో పరిశుభ్రతను మెరుగుపరచాలి: కమిషనర్

కార్పొరేషన్, ఏప్రిల్ 25 : నగరంలో పరిశుభ్రతను మరింత మెరుగు పరిచేలా పారిశుధ్య అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. శుక్రవారం నగరంలోని 5, 26, 27వ డివిజన్ల పరిధిలో పర్యటించి, పారిశుధ్య పనులను పరిశీలించారు. నగరపాలక సంస్థ ద్వారా నిర్వహించే అన్నపూర్ణ 5 రూపాయల భోజన కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. అలాగే కరీంనగర్ నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలో రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి.. అర్హుల జాబితాను అందించాలని వార్డు ఆఫీసర్లను ఆదేశించారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

సైదాపూర్, ఏప్రిల్ 25: ఈ నెల 27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి, వెన్నంపల్లి సింగిల్‌విండో చైర్మన్ బిల్ల వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎస్సీ విభాగం మండలాధ్యక్షుడు ఎల్కపల్లి రవీందర్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఓరుగంటి దేవేంద్ర కోరారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో కార్యకర్తలతో సభ సన్నాహక సమావేశాలు నిర్వహించారు. సభకు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు భారీగా తరలివచ్చి సత్తాచాటాలన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామశాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా శ్రీ చైతన్య వార్షికోత్సవాలు

వేడుకల్లో ఆకట్టుకున్న ఎన్‌సీసీ విద్యార్థుల విన్యాసం

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 25 : జిల్లా కేంద్రంలోని మంకమ్మతోట శ్రీ చైతన్య డిగ్రీ, పీజీ కళాశాలల వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. 28 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో తమ కళాశాల నాణ్యమైన విద్యనందిస్తున్నదన్నారు. విద్యార్థులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా తమ విద్యాసంస్థలు పని చేస్తున్నాయన్నారు. ప్రతి సంవత్సరం ఎందరో శ్రీ చైతన్య డిగ్రీ విద్యార్థులు యూనివర్సిటీ ఫలితాల్లో అగ్రస్థానంలో ఉండడంతో పాటు, బహుళ జాతి సంస్థలకు, ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికవడమే దీనికి నిదర్శనమన్నారు. వేడుకల్లో ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎల్ శ్రీనివాస్, డాక్టర్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రినిటీ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న విద్యార్థులు తదితరులు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 25: బొమ్మకల్‌లోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో వల్లీ ఎంట్రర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. దీనికి 120 మంది విద్యార్థులు హాజరు కాగా, 32 మందిని ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ వెల్లడించారు. సెలెక్ట్ అయిన విద్యార్థులను కళాశాల ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి, కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర సింగ్, ఏవో రాజశేఖర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పి. కిశోర్, ఎంబీఏ విభాగం అధిపతి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు బలరాం, శ్రీధర్, సంపత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఏప్రిల్ 25: నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నందున శనివారం సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-1, 2 ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, ఎం లావణ్య వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 8.30నుంచి 9.30గంటల వరకు జ్యోతినగర్ పోస్ట్ ఆఫీసు ఏరియా, సంతోష్ మాతగుడి ఏరియా, గీతా భవన్ వెనుక ప్రాంతం, నారాయణ కాలేజీ ఏరియా, ధన్గర్ వాడీ స్కూల్ ప్రాంతం, ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ఇంగ్లిష్ యూనియన్ స్కూల్ ఏరియా, కవిత సారీ సెంటర్ ప్రాంతం, జ్యోతినగర్ కుర్మవాడ, ఉదయం 8నుంచి 11గంటల వరకు తిరుమల నగర్ ఏరియా, మౌలి చంద్ర అపార్ట్ మెంట్, గిద్దె పెరుమాండ్ల కమాన్ ప్రాంతం, ఆయిల్ మిల్ ట్రాన్స్ ఫార్మర్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గంగాధర: మధురానగర్‌లో పార్టీ కండువాలు, వాహన స్టిక్కర్లు అందజేస్తున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు

చిగురుమామిడి: నవాబ్ పేట్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఊరూరా.. రజతోత్సవ సంబురం

- గంగాధర మండలంలో పండుగ వాతావరణం

గంగాధర, ఏప్రిల్ 25: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సందర్భంగా గంగాధర మండలంలో పండుగ వాతావరణం నెలకొంది. నేతల సన్నాహక సమావేశాలు, వాల్ రైటింగ్స్, గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ గద్దెల నిర్మాణం, వాల్ పోస్టర్ల ఆవిష్కరణ, జెండాలు, కండువాల పంపిణీ, వాహనాలకు స్టిక్కర్లు అంటించే కార్యక్రమాలతో నాయకులు, కార్యకర్తల్లో నయా జోష్ కనిపిస్తున్నది. రజతోత్సవ సభ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మూడు సార్లు సన్నాహక సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను సభకు ఆహ్వానిస్తున్నారు. జెండా గద్దెలకు రంగులు వేసి జెండా పండుగకు సిద్ధం చేశారు. 25 ఏండ్ల బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ ప్రస్థానంలో ఆనాటి ఉద్యమ గుర్తులు, ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం, స్వరాష్ట్రంలో గత పదేళ్లల్లో జరిగిన అభివృద్ధిని గుర్తు చేసుకునే రజతోత్సవ సభకు తరలివెళ్లడానికి ఉత్సాహంగా ఎదురుచూస్తున్నట్లు కార్యకర్తలు తెలిపారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

చిగురుమామిడి, ఏప్రిల్ 25: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండల వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నవాబుపేట గ్రామంలో రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, మాజీ మండలాధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి, గ్రామాధ్యక్షుడు పిల్లి వేణు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ కో ఆప్షన్ సభ్యుడు మక్బూల్ పాషా, నాయకులు శరభంద రెడ్డి, కిష్టారెడ్డి, బోయిని సతీశ్, కొక్కిస రవీందర్, ఆగయ్య, కూతురు రాజిరెడ్డి, ఎడెల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర నిఘా వైఫల్యంతోనే ఉగ్రదాడులు'

తెలంగాణచౌక్, ఏప్రిల్ 25: జమ్ముకశ్మీర్ పహల్గాంలో ఇటీవల పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడులు కేంద్ర నిఘా వైఫల్య ఫలితమేనని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్ వీరయ్య ఆరోపించారు. నగరంలోని ఆ పార్టీ కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవనంలో జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పర్యాటకులను కాపాడడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉగ్రవాదుల దాడులను బీజేపీ మత దాడులుగా చిత్రీకరించి రాజకీయ ప్రయోజనాలు పొందాలని ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. అలాగే, రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాలు కొనసాగిస్తామన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి గుడికందుల సత్యం, కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు ముకుందారెడ్డి, నాయకులు వర్ల వెంకటరెడ్డి, బీమాసాహెబ్, ఎడ్ల రమేశ్, నరేశ్‌పటేల్ పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

విద్యానగర్, ఏప్రిల్ 25: కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్ర వారం స్థానిక కోతిరాంపూర్‌లోని మహేంద్ర షోరూంలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది, కస్టమర్లకు ఉచిత మెగా వైద్య శిబిరం, హెల్త్ టాక్ నిర్వహించారు. ఈ శిబిరాన్ని షోరూం మేనేజ ర్ కొత్త కొమురెల్లారెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో 110 మందికి హాస్పిటల్ వైద్యుడు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ లోకేష్ బీరకాయల వైద్య పరీక్షలు చేశారు. వివిధ రకాల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ.. తమ హాస్పిటల్‌లో 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. శిబిరంలో హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 25: కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న తలపెట్టిన దేశ వ్యాప్తసార్వత్రిక సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ వీరయ్య పిలుపునిచ్చారు. నగరంలోని బద్దంఎల్లారెడ్డి భవనంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా కార్మిక సంఘాల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, ఏఐటీయూసీ కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మడి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

జమ్మికుంట, ఏప్రిల్ 25: మాచినపల్లి గ్రామానికి చెందిన ముప్పు మల్లయ్య(72) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. మల్లయ్య-ఎల్లమ్మలు భార్యాభర్తలు. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి పిల్లలు లేక పోవడంతో తమ అన్న కొడుకును సాదుకున్నాడు. పెళ్లి చేశాడు. గత కొద్ది కాలంగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని తెలిసింది. అయితే శుక్రవారం సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన మల్లయ్య ఇంటికి రాలేదు. బావిలో పడిపోయాడని గుర్తించారు. అప్పటికే మల్లయ్య మృతి చెందాడు. అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడా..? ప్రమాదవశాత్తు జారి పడ్డాడా..? తెలియకున్నది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాథమిక సమాచారం తెలుసుకున్నారు. విచారణ చేస్తున్నారు. ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి..

వీణవంక, ఏప్రిల్ 25: బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఎండీ అంకూస్ (78) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. ఎస్ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఎండీ అంకూస్ మానసిక స్థితి సరిగా లేదు. శుక్రవారం ఉదయం అదే గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడడంతో మృతిచెందాడు. అతడి కొడుకు ఇబ్రహీమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

రామడుగు, ఏప్రిల్ 25 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలో ఏప్రిల్ 1వ తేదీ 2024 నుంచి మార్చి 31వ తేదీ 2025 వరకు జరిగిన ఈజీఎస్ పనుల నిర్వహణపై అన్ని గ్రామసభల్లో గర్తించిన అంశాలను చదివి వినిపించారు. కాగా, సామాజిక తనిఖీలో మండలంలోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లకు రూ. 35,726 జరిమానా విధించినట్టు ఎంపీడీవో రాజేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈసీలు, డీఆర్పీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు వరి పంట దగ్ధం

చిగురుమామిడి, ఏప్రిల్ 25: బొమ్మనపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు కౌలు రైతుకు చెందిన వారిపంట దగ్ధమైంది. బొమ్మనపల్లి గ్రామానికి చెందిన సుకోషి విజ్జగిరి రాయిని చెరువు వద్ద గల తన వ్యవసాయ వరి పంటను హార్వెస్టర్‌తో చేయించాడు. అందులో ఉన్న వరి కొయ్యకాళ్లను తొలగించేందుకు శుక్రవారం నిప్పంటించాడు. నిప్పు వరి కొయ్యలతో పాటు పక్కనే ఉన్న వ్యవసాయ భూమిని కౌలు చేస్తున్న పోతుల రమేశ్ వరి పంట కుప్పలకు అంటుకున్నది. సుమారు 50 వేల విలువైన పంట కాలిబూడిద అయిందని రమేశ్ విలిపించాడు. ఏఈవో అఖిల ఘటనా స్థలానికి చేరుకుని దగ్ధమైన వరి కుప్పలను పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకోవాలని రమేశ్ కోరుతున్నారు.

అంగన్‌వాడీ టీచర్‌పై తేనెటీగల దాడి

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 25: మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో తేనెటీగల దాడిలో అంగన్‌వాడీ టీచర్ ముత్యాల సరోజనకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. శుక్రవారం సరోజన రోడ్డుపై వెళ్తుండగా తేనెటీగలు ఎక్కడి నుంచి వచ్చాయో కాని ఒక్కసారిగా దాడి చేశాయి. ఆమెకు గాయాలు కాగా, చికిత్స కోసం హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మరో ఇద్దరికి కూడా స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. కాగా, 15 రోజుల క్రితం ట్రాన్స్‌కో ఉద్యోగులపై కూడా తేనెటిగలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఎక్కడి నుంచో వస్తూ తేనెటీగలు ఆకస్మికంగా దాడి చేస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

వాటర్‌ట్యాంక్ కూలి చిన్నారి మృతి

పైనీశ్రీ (ఫైల్)

మానకొండూర్, ఏప్రిల్ 25 : తల్లిదండ్రులతో కలిసి కొత్తగా ఏర్పాటు చేసే దాబా వద్దకు వెళ్లిన ఆ ఎనిమిదేళ్ల చిన్నారి అనుకోని రీతిలో మృత్యుఒడికి చేరింది. వాటర్ ట్యాంక్ కూలి ప్రాణాలు కోల్పోయింది. సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం చెంజర్లకు చెందిన గొల్లెన సంతోష్, కోమలత దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు పైనీశ్రీ (8), ధనశ్రీ(5) ఉన్నారు. సంతోష్, కోమలత దంపతులు గ్రామశివారులో జాతీయరహదారి పక్కనే ఉన్న సొంత భూమిలో దాబా ఏర్పాటు చేసుకోవడానికి ఐదు రోజుల క్రితం ఐదు ఫీట్ల ఎత్తుతో ఖాళీ స్థలంలో ఓ వాటర్‌ట్యాంక్ నిర్మించారు. శుక్రవారం తమ పెద్ద కూతురు పైనీశ్రీని తీసుకొని వాటర్‌ట్యాంక్ వద్దకు వెళ్లి నీరు నింపారు. ఈ క్రమంలో వాటర్‌ట్యాంక్ అకస్మాత్తుగా కూలి అక్కడే ఆడుకుంటున్న పైనీశ్రీపై సిమెంట్ ఇటుకలు పడిపోయాయి. ఈ ప్రమాదంలో తలకు, ముక్కుకు తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఆ బాలికను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిల్లెట్స్ వ్యాపారం దిశగా యువత సాగాలి

జమ్మికుంట, ఏప్రిల్ 25: చిరుధాన్యాల వ్యాపారంలో యువతకు అపార అవకాశాలున్నాయని, యువత ఆ దిశగా సాగాలని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీ రమేశ్ పేర్కొన్నారు. కళాశాలలో వ్యవస్థాపక, అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మిల్లెట్స్ వ్యాపార నిర్వహణను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని, సబ్సిడీ రుణాలు అందిస్తున్నదని తెలిపారు. మిల్లెట్ వ్యాపార నిర్వాహకులు సుంకిశాల స్వరూప, రాధ వ్యాపార విషయాలను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఓదెలుకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

లైంగికంగా వేధించిన ఒకరిపై కేసు

వీణవంక, ఏప్రిల్ 25: పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళను లైంగికంగా వేధించిన ఘటనలో పంజాల సమ్మయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. లైంగికంగా వేధిస్తూ, చంపుతానని బెదిరింపులకు గురి చేస్తున్నాడని సదరు మహిళ ఫిర్యాదు చేయగా, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇద్దరు ఘరానా దొంగల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సీపీ గౌష్ ఆలం

నిందితుల అరెస్ట్ చూపుతున్న సీపీ, ఇతర పోలీసు అధికారులు

కరీంనగర్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : వరుస దొంగ తనాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న ఇద్దరు దొంగలను కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులకు సంబంధించిన వివరాలను సీపీ గౌష్ ఆలం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేటలోని అశోక్‌నగర్‌కు చెందిన సూర రవి తల్లితో కలిసి కరీంనగర్‌లో ఉంటున్నాడు. వ్యసనాలకు బానిస కావడంతో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. గతంలో కరీంనగర్‌లో పలు దొంగతనం కేసుల్లో జైలుకు కూడా వెళ్లి వచ్చాడని, అయినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదని సీపీ తెలిపారు. రవి తరచూ దొంగతనాలకు పాల్పడుతుండడంతో విసిగి పోయిన భార్య పిల్లలు సహా పుట్టింటికి వెళ్లిపోయిందని తెలిపారు. అయితే గత నెల 13న రాత్రి సప్తగిరి కాలనీలోని ఒక ఇంట్లో చొరబడి నగదు, బంగారు ఆభరణాలను దొంగిలించాడు. వీటిని విజయవాడలో అమ్మేసి జల్సాలు చేశాడు. గురువారం పద్మనగర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి, అతడి నుంచి రెండు బంగారు బిస్కట్లు, కత్తిరించిన బంగారు కడ్డీలు స్వాధీనం చేసుకున్నారని, వీటి మొత్తం 105 గ్రాములు ఉంటుందని సీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ ఏ తిరుపతి, హెడ్ కానిస్టేబుళ్లు జీ రవీందర్ సాయి దీప్, అవినాష్, మల్లయ్య, సాయికిరణ్‌ను సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

మరో దొంగ అరెస్ట్..

కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల లగేజీ బ్యాగులు చోరీ చేస్తున్న వ్యక్తిని కూడా అరెస్ట్ చేసినట్లు సీపీ గౌష్ ఆలం తెలిపారు. నిందితుడి నుంచి 150 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం ఉదయం వన్ టౌన్ సీఐ బిల్లా కోటేశ్వర్ తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చిగురుమామిడి మండలం నవాబుపేటకు చెందిన కంది సంపత్‌రెడ్డి అనే వ్యక్తి ముఖానికి మాస్క్ వేసుకుని తిరుగుతుండగా అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా బస్టాండ్‌లో లగేజీ బ్యాగులు, బంగారు నగలను దొంగిలించినట్లు అంగీకరించినట్లు సీపీ తెలిపారు. గత ఫిబ్రవరి 13న కరీంనగర్ బస్టాండ్‌లో ఒక మహిళ బ్యాగు నుంచి 16.5 తులాల బంగారు ఆభరణాలు, అదే నెల 24న మరో మహిళ బ్యాగు నుంచి 47 గ్రాముల బంగారం, ఈ నెల 8న గోదావరిఖని నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ఒక వృద్ధుడికి చెందిన రూ. 13 లక్షలు దొంగిలించినట్లు అంగీకరించాడని, దొంగిలించిన సొత్తును దాచుకునే ప్రయత్నంలో అతడిని పోలీసులు పట్టుకున్నారని సీపీ తెలిపారు. ఈ కేసులో నిందితుడిని పట్టుకున్న పోలీసులను అభినందించారు.

ఉగ్రదాడిపై నిరసనలు